క్లుప్తంగా

నేడు ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక

కర్నూలు(అర్బన్): ఈ నెల 30వ తేదీన ఏపీ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ కర్నూలుకు వస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాట ఓబులేసు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం జిల్లా పర్యటన అనంతరం సాయంత్రం 4 గంటలకు కర్నూలుకు చేరుకొని, ఇటీవల వైఎస్సార్ కడప జిల్లాలో హత్యకు గురైన పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డా.అచ్చెన్న కుటుంబ సభ్యులను పరామర్శిస్తారన్నారు. స్థానిక నాగిరెడ్డి రెవెన్యూ కాలనీ, రామచంద్ర మిషన్ ఎదురుగా ఉన్న డా.అచ్చెన్న నివాసం వద్దకు దళిత సంఘాల నాయకులు హాజరు కావాలని ఓబులేసు కోరారు.

చలో ఢిల్లీపై విస్తృత ప్రచారం

కర్నూలు(సెంట్రల్): కార్మికులు, కర్షకుల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 5వ తేదీ చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమంపై సీఐటీయూ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. బుధవారం ముజఫర్ నగర్‌లోని మట్టి కూలీల అడ్డాలో భవన నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్షుడు కె.సుధాకరప్ప నేతృత్వంలో కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే మార్కెట్ యార్డులో జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో కార్మికులు, కర్షకులకు చలో ఢిల్లీ కార్యక్రమంపై వివరించారు. ఆయా సందర్భాల్లో పీఎస్‌రాధాకృష్ణ, సుధాకరప్ప మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం కార్మికులను, కర్షకులను మోసం చేస్తోందన్నారు. ప్రభుత్వ ఆస్తులను అదానీ, అంబానీలకు కట్టబెట్టి అన్యాయం చేస్తోందన్నారు. దేశంలో వ్యవసాయం అటకెక్కిందని, రోజురోజుకు పెరుగుతూ పోతున్న ఎరువులు, విత్తనాల ధరలు అన్నదాతను తీవ్రంగా క్రుంగదిస్తున్నాయన్నారు.

డాక్టర్ అచ్చెన్నకు నివాళి

కర్నూలు(అర్బన్): ఇటీవల వైఎస్సార్ కడప జిల్లాలో హత్యకు గురైన పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అచ్చెన్నకు జిల్లా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నేతలు ఘనంగా నివాళి అర్పించారు. బుధవారం సాయంత్రం స్థానిక సీ క్యాంప్ సెంటర్‌లోని కార్యాలయం ఆవరణలో అచ్చెన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి క్యాండిల్స్ పట్టుకొని నివాళి అర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీ మధుసూదన్, వెంకటేష్, కోశాధికారి చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాముడు, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఈరన్న, రిటైర్డు పీఆర్ ఎస్ఈ కే సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు న్యాయపరమైన చట్టబద్ధంగా లైజనింగ్ ఆఫీసర్‌ను నియమించాలన్నారు. అచ్చెన్న కుటుంబానికి న్యాయం చేసి ఆదుకోవాలన్నారు. దోషులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం



కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్న వైద్యులు

కర్నూలు(అగ్రికల్చర్): సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీ అగ్రగామిగా నిలుస్తోందని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి పేర్కొన్నారు. బుధవారం కర్నూలు రైల్వేస్టేషన్‌లోని కార్మికులు, హమాలీలకు కోరమాండల్ ఎరువుల కంపెనీ ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని కర్నూలు ఏడీఏ ప్రారంభించారు. మెడికవర్ వైద్యశాల డాక్టర్లు దాదాపు 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఇటీవలనే పేద విద్యార్థులకు లక్షలాది రూపాయల స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఏడీఏ వీరారెడ్డి, కర్నూలు ఏఓ విశ్వనాథ్, కోరమాండల్ కంపెనీ డీజీఎం గోవిందరావు, ఆర్ఎల్ఎం శేషుకుమార్, సీనియర్ అగ్రానమిస్టు శ్రీధర్‌రెడ్డి, మార్కెటింగ్ ఆఫీసర్ శివకుమార్, ప్రతినిధులు నాగరాజు, శ్రావణ్‌కుమార్, ఏడబ్ల్యూఎస్ఎల్ మేనేజర్ దయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

2న 'కథా స్రవంతి' ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్: అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 2వ తేదీ ఉదయం 10 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ప్రముఖ కథా రచయిత డాక్టర్ ఎం.హరికిషన్ రచించిన 'కథా స్రవంతి' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. పాలగిరి విశ్వప్రసాద్, తవ్వా ఓబుల్‌రెడ్డి, ఉమా మహేశ్వర్, జంధ్యాల రఘుబాబు, డాక్టర్ చంద్రమౌళిని ముఖ్య వక్తలుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. సాహితీ అభిమానులు అందరూ పాల్గొనవచ్చని విజ్ఞప్తి చేశారు.

సీతా రామ.. జయజయ రామ

- నేడు శ్రీరామ నవమి
- ముస్తాబైన ఆలయాలు
- స్వామివారి కల్యాణోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరంలో గురువారం శ్రీరామ నవమి వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలకు ఆలయాలను ముస్తాబు చేశారు. హిందువులకు అత్యంత ముఖ్యమైన ఈ పండుగను సీతారామ, ఆంజనేయ స్వామి ఆలయాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. వసంత రుతువు చైత్ర శుద్ధ నవమి, పునర్వసు నక్షత్రం కర్కాటక లగ్నంలో సరిగ్గా అభిజిత్ ముహూర్తంలో అంటే మధ్యాహ్నం 12 గంటల సమయంలో త్రేతా యుగంలో శ్రీరాముడు జన్మించాడు. ఆయన జన్మదినాన్ని ప్రజలు పండుగగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇదే రోజును పరమ పవిత్రంగా భావించి సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోనున్నారు. స్వామివారికి అభిషేకాలు, పల్లకి సేవ, రథోత్సవం, ఉత్సవ మూర్తుల ఊరేగింపు, చందనోత్సవం నిర్వహించనున్నారు. ఆధ్యాత్మిక సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అశోక్‌నగర్ శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి, ద్వారకామాయి సాయిబాబ దేవస్థానం, నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయం, శ్రీనివాసనగర్‌లోని సత్యసాయి మందిరం, సంకల్‌బాగ్‌లోని హరి హర క్షేత్రం, వీఆర్ కాలనీలోని చిన్మయ మిషన్, వెంకటేశ్వర స్వామి ఆలయం, బుధవారపేట ఈశ్వర ఆంజనేయ స్వామి



బళ్లారి చౌరస్తా అభయాంజనేయ స్వామి ఆలయంలో కల్యాణ మూర్తులుగా సీతారాముల వారు

ఆలయం, బళ్లారి చౌరస్తాలోని అభయాంజనేయ స్వామి ఆలయం, కొత్తపేట, శ్రీరామనగర్‌లోని సీతారామాంజనేయ స్వామి ఆలయాలు, ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల దేవాలయం, తెలుగు గేరిలోని చిన్న ఆంజనేయ స్వామి ఆలయం, ఇస్కాన్ పూరి జగన్నాథ మందిరం, దక్షిణ షిరిడీ సాయిబాబ దేవస్థానం, అరోరానగర్ రాజరాజేశ్వరీ దేవి ఆలయం, చాణిక్యపురి కాలనీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం, ఓల్డ్‌సిటీ లలితా పీఠంలో సీతారాముల కల్యాణోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

సద్గుణాల కలయికే ఉత్తమ జీవితానికి మార్గం

ఉత్తమ గుణాల్లో అందరికీ ఆదర్శంగా నిలిచే మహనీయుడు శ్రీరాముడు. ఆయన గుణ గణాల్లో కనీసం 20 శాతం అనుసరిస్తే సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగవచ్చు. సద్గుణాల కలయికే ఉత్తమ జీవితానికి మార్గం. రాముడి ఉత్తమ గుణాల్లో కొన్ని ఇలా.. శ్రీరాముడు అరవింద దళాయతాక్షుడు. నీల మేఘ శ్యాముడు. విశ్వామిత్రుడి వెంట మిథిలా నగరానికి వచ్చిన శ్రీరాముడు ఒక ఆలయం వద్ద సీతను చూస్తారు. ఆమెను ఇష్టపడి వివాహం చేసుకోవా



వీఆర్ కాలనీ చిన్మయ మిషన్‌లో శ్రీరామ నవమి వేడుకల ఏర్పాట్లు

లనుకుంటారు. జనక మహారాజు సీతకు వివా హం జరిపించాలని స్వయం వరం ప్రకటించగా పట్టుదలతో స్వయం వరంలో శివ ధనస్సును అవలీలగా విరిచి తాను కోరుకున్న పడతిని పరిణయ మాడి ప్రేమమూర్తిగా నిలిచారు. నేటి యువతీ యువకులు ప్రేమలోపడి పెళ్లి విషయంలో పెద్దలను ఒప్పించుకోలేక ఆత్మహత్యలకు పాల్పడి విలువైన జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారు. ఇది ఎంత వరకు సమంజసమో ఆలోచించాలి. ధైర్యంగా ప్రేమను జయించుకోవాలి. తల్లిదండ్రులను ఒప్పించాలి.

ధీరోదాత్తుడు.. రఘోత్తముడు:

శ్రీరాముడు యుక్త వయసులోనే రాజర్షి విశ్వామిత్రుడి వెంట వెళ్లి ధైర్య సాహసాలతో 'తాటకి' అనే రాక్షసిని సంహరించారు. నేటి యువత కూడా ధైర్య సాహసాలతో ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి. అందుకు తగిన విద్యను నేర్చుకోవాలి. శిక్షణ తీసుకోవాలి. అప్పుడే విజయ తీరాలకు చేరుకోగలరు. అలాగే రాముడు గురు భక్తి పరాయణుడు, పితృవాక్య పరిపాలకుడు, శరణాగత తత్పరుడు. గురువుల ఉప దేశాన్ని తుచా తప్పకుండా పాటించారు. ప్రస్తుతం విద్యార్థులు తమ గురువుల మాటలకు విలువ ఇవ్వడం లేదు. విద్యా బుద్ధులు నేర్పి ఉన్నతులుగా తీర్చి దిద్దిన వారికి ఎల్లకాలం రుణపడి ఉండాల్సిందే. అదేవిధంగా తల్లిదండ్రుల మాటలకు విలువ ఇచ్చి వినే యువతీ యువకులు ఉన్నత స్థాయికి ఎదుగుతారు. ప్రతి ఒక్కరూ మాత పితలను గౌరవించాలి. వారి మార్గదర్శనంలో నడవాలి. తనను శరణు వేడిన వారు శత్రువైనా ఆదరించే స్వభావం కలవాడు రాముడు. కానీ నేడు అన్నదమ్ముల మధ్యనే శతృత్వ కోరలు జడలు విప్పుకుంటున్నాయి. అనుబంధాలు అటకెక్కి ఒకరినొకరు కొట్టుకోవడం..చంపుకోవడం సర్వసాధారణంగా మారిపోయింది. శతృత్వాన్ని వీడి అందరూ స్నేహతత్వాన్ని పెంపొందించుకుంటే ఉత్తమ సమాజం నిర్మితమవుతుంది.

రామ నామం ఎంతో గొప్పది



సీతాపతి శ్రీరాముడు శరణాగతుడు. ఆ మహానుభావుడిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలి. ఆయన్ను ఎన్ని విధాల కొలిచినా అందరికి శుభం కలుగుతుంది. ఏ కార్యం మొదలు పెట్టినా ముందుగా శ్రీరామ నామం స్మరించుకుంటే సత్ఫలితాలు వస్తాయని వేద గ్రంథాలు చెబుతున్నాయి. అందుకే ప్రతి గ్రామంలో నేటికి రామభజన నిరాటంకంగా సాగుతుందంటే రామ నామం ఎంత గొప్పదో తెలుస్తుంది.

– పి. చంద్రశేఖర శర్మ, పండితుడు

2న 'బీఎల్ఎస్' సదస్సు

కర్నూలు(హాస్పిటల్): అత్యవసర పరిస్థితిల్లో ప్రాణాలు నిలిపే బేసిక్ లైఫ్ సపోర్ట్(బీఎల్ఎస్) అంశంపై ఏప్రిల్ 2వ తేదీన అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్థానిక ఎ.క్యాంపులోని హల్త్‌క్లబ్‌లో సదస్సు ప్రారంభమవుతుందని, సదస్సులో సీనియర్ అనెస్తీషియాలజిస్టు డాక్టర్ వై.అశోక్ బీఎల్ఎస్‌పై శిక్షణ ఇస్తారన్నారు.

ఆసుపత్రికి కుళాయి ఉపకరణాల విరాళం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అవసరాల కోసం ఏపీ యాదవ చైతన్య వేదిక నాయకులు వరుణ్‌యాదవ్ అనే వ్యక్తి బుధవారం రూ.11వేల విలువ చేసే కుళాయి ఉపకరణాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది పేదలకు ప్రాణదానం చేస్తున్న ఈ ఆసుపత్రికి కొంతైనా సాయం చేయాలన్న ఉద్దేశ్యంతో తాను ఈ ఉపకరణాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, ఉపాధి కల్పనాధికారి సోమశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో బిల్లులు చెల్లించండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించి సంస్థ పురోగతికి సహకరించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ ఏడీఈ వై.సుబ్బన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్, యాప్‌ల ద్వారా చెల్లించడం సులభమని పేర్కొన్నారు.

మాది.. చేతల ప్రభుత్వం



పాదుపు మహిళలకు ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



సమావేశానికి హాజరైన మహిళలు

- హామీలన్నింటినీ అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌దే
- కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాటిస్తే కచ్చితంగా నెరవేరుస్తారని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలా వైఎస్సార్‌సీపీ మాటల ప్రభుత్వం కాదని, మాది చేతల ప్రభుత్వం అని పేర్కొన్నారు. మ్యానిఫెస్టోను పవిత్రమైన భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లగా భావించి ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. బుధవారం స్థానిక కుడా కార్యాలయం ప్రాంగణంలో వైఎస్ఆర్ ఆసరా మూడవ విడత కార్యక్రమం నిర్వహించారు. 3034 గ్రూపులకు రూ.19 కోట్ల 90 లక్షలు చెక్కును ఎమ్మెల్యే మహిళలకు అందజేశారు. పాదుపు మహిళలు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ..వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన మూడున్నర ఏళ్లలో 93.5 శాతం హామీలను నెరవేర్చిందని చెప్పారు. మహిళల కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి పాటుపడుతోందన్నారు. గత ప్రభుత్వంలో పాదుపు మహిళలకు రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాక వారిని నిలువునా మోసం చేశారన్నారు. కల్లబొల్లి మాటలు చెప్పేందుకు మరోసారి తెలుగుదేశం నాయకులు రోడ్లు ఎక్కుతున్నారని, ప్రజలు నమ్మొద్దని సూచించా. ఏ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలకు మేలు చేసిందో మహిళలు గుర్తించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ మాత్రమే పేదల పక్షపాతి అని, వచ్చే ఎన్నికల్లో మహిళలందరు కలిసి కట్టుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గడ్డం రామకృష్ణ కార్పొరేటర్లు విజయలక్ష్మి, కైపా పద్మాలతా రెడ్డి, పల్లవి, కోఆప్షన్ మెంబర్ శ్రీరాములు, మెప్మా పీడీ నాగశివలీల, టీఆర్‌ఓ వెంకటలక్ష్మి, టీఎంసీ సుధాకర్, పాదుపు మహిళలు పాల్గొన్నారు.

ప్రాణాంతక వ్యాధులు రాకుండా టీకా రక్షణ

కర్నూలు(హాస్పిటల్): చిన్నారులకు టీకా వేయించడం వల్ల భవిష్యత్‌లో వారికి ప్రాణాంతక వ్యాధులు రాకుండా రక్షణగా ఉంటుందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం కర్నూలు నగర శివారులోని బి.తాండ్రపాడు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. గర్భిణులకు, చిన్నారులకు టీకాలు అందుతున్నాయో లేదా పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. ముఖ్యంగా వాయిల్స్ ఉపయోగించే సమయం, తేది, అత్యవసర మందుల కిట్, టీకా అర్హుల జాబితా, టీకా కార్డులో నమోదుల తేదీలు తదితర అంశాలను టీకా కేంద్రంలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భవతులు, పిల్లలకు కప్పం తప్పకుండా టీకాలు ఇవ్వాలని, ఆ వివరాలను మాతాశిశు సంరక్షణ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి గర్భిణికి, పుట్టిన బిడ్డ మొదలు స్కూల్ పిల్లల వరకు ప్రాణాంతక వ్యాధులు రాకుండా వ్యాధినిరోధక టీకాలు రక్షణగా ఉంటాయన్నారు. తమ పిల్లల ఆరోగ్యంపై తల్లి తరచూ ప్రత్యేక నిఘా ఉంచాలని, అనారోగ్య లక్షణాలు ఉన్నప్పుడు దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత చికిత్స, సూచనలు, సలహాలు పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ నాగరాజు, సీహెచ్‌వో రాధా మోహన్, ఆరోగ్య కార్యకర్త కృష్ణవేణి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 99 మందికి ఉద్యోగాలు

కర్నూలు సిటీ: నగర శివారులోని బి.తాండ్రపాడు దగ్గర ఉన్న ప్రభుత్వ మైనార్టీ పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహించిన జాబ్ మేళాలో 99 మందికి ఉద్యోగాలు లభించినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.చక్రవర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌పీసీ ఇంజన్ కాంపొనెంట్ ప్రైవేటు లిమిటెడ్ వారు ఈ నెల 8న నిర్వహించిన మేళాలో 149 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిలో 31 మంది ప్రభుత్వ మైనార్టీ పాలిటెక్నిక్ కాలేజీకి చెందిన విద్యార్థులు ఉన్నారన్నారు.

మరింత సుందరంగా కర్నూలు

- రెండేళ్ల వ్యవధిలో ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి
- మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్



రూ. 2 కోట్లతో ఏర్పాటు చేయనున్న స్మార్ట్ స్ట్రీట్‌కు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మేయర్, ఎమ్మెల్యే, కమిషనర్‌లు

కర్నూలు(టౌన్): కర్నూలు నగరపాలక సంస్థకు పాలకవర్గం వచ్చి రెండేళ్ల వ్యవధిలో రూ. కోట్లు విలువ చేసే అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ వెల్లడించారు. బుధవారం సాయంత్రం స్థానిక బిర్లా కాంపౌండ్ వద్ద రూ.2 కోట్లతో చేపట్టనున్న స్మార్ట్ స్ట్రీట్ నిర్మాణ పనులకు కమిషనర్ భార్గవ్‌తేజతో కలిసి వారు శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు మరింత సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే స్మార్ట్‌సిటీ కింద ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. ఒకప్పటి రాజధాని కర్నూలు నగరాన్ని విజయవాడ, విశాఖపట్నం పట్టణాలకు ఏ మాత్రం తీసిపోని విధంగా మారుస్తామన్నారు. రూ.2 కోట్లు వెచ్చించి నగరంలోని రైతుబజార్ సర్కిల్ నుంచి బిర్లా కాంపౌండ్ వరకు సైకిల్ ట్రాక్, కారు పార్కింగ్, పాదచారులు కూర్చునే విధంగా ఏర్పాటు చేయడం, లైటింగ్, పూర్తి స్థాయిలో ట్రాఫిక్ నియంత్రించడం వంటి పనులు చేస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామన్నారు.

ఈట్ స్ట్రీట్ పనుల పరిశీలన :

అనంతరం బిర్లాగేట్ సమీపంలో రూ.2 కోట్లతో చురుగ్గా సాగుతున్న ఈట్ స్ట్రీట్ పనులను మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, కమిషనర్ భార్గవ్‌తేజ పరిశీలించారు. పనుల ప్రగతిని ఎమ్మెల్యే కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఎలాంటి పనులు చేస్తున్నారు.. అంటూ అడిగారు. త్వరగా పనులు పూర్తి చేస్తే ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకా, కర్నూలు నగర వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు, కార్పొరేటర్ సిత్రా సత్యనారాయణమ్మ, గాజుల శ్వేతారెడ్డి, షేక్ నీలోఫర్, కటారి పల్లవి, పార్టీ నాయకులు గడ్డం రామకృష్ణా, కటారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల శిశువుకు అరుదైన ఆపరేషన్

కర్నూలు(హాస్పిటల్): పుట్టుకతో పేగు సరిగా ఏర్పడని రెండు రోజుల చిన్నారికి వైద్యులు ఆపరేషన్ చేసి ప్రాణం పోశారు. బుధవారం పెంచికలపాడులోని విశ్వభారతి జనరల్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ కృష్ణనాయక్ వివరాలు వెల్లడించారు. 'గూడూరు మండలానికి చెందిన శివరాజమణి, మద్దిలేటి దంపతుల కుమారుడైన 2 రోజుల శిశువుకు పుట్టుకతోనే పేరు సరిగ్గా అభివృద్ధి కాకపోవడం(కన్‌జెనిటిల్ డ్యూయోడినల్ అట్రిసియా)తో తాగిన పాలు కిందకు దిగక వాంతులు అయ్యేవి. ఇలాంటి జబ్బు 10వేల మంది పిల్లల్లో చాలా అరుదుగా ఒకరికి మాత్రమే వస్తుంది. శిశువుకు 10 రోజుల క్రితం ఆపరేషన్ చేసి లోపాన్ని సరిచేశాం.



రెండు రోజుల శిశువుతో వైద్యుల బృందం

శిశువు ఇప్పుడు పాలు బాగా తాగుతూ కోలుకుంటోంది. ఆపరేషన్‌లో నాతో పాటు అనెస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీకుమార్, పీడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ పీవీ.కృష్ణ పాల్గొన్నారు' అని వివరించారు.

బీజేపీ మైనార్టీ మోర్చా నూతన కమిటీ

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా పార్టీ మైనార్టీ మోర్చా నూతన కమిటీని మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు అవిలన్‌బాబు ప్రకటించారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీ సభ్యుల పేర్లను వెల్లడించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా మౌలాలి, జ్యోతి, సాకీ మహమ్మద్ బుకర్ సిద్దిక్, సోహెల్, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా దిలీప్ రాథోడ్, అన్వర్ బాషా, కార్యదర్శులుగా రవికుమార్, యూసుఫ్, సలీం, సత్తార్ బాషా, కోశాధికారిగా రషీద్, కార్యవర్గ సభ్యులుగా సన్నీడియోల్, ఆరిఫ్ ఖాన్, షేక్ మహబుబ్ బాషా, ప్రేమానంద్, దర్గా సాహెబ్, మహబుబ్ బాషా నియమితులయ్యారు. అన్య భాష రాష్ట్ర కన్వీనర్ ప్రకాష్ జైన్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళింగి నరసింహవర్మలు పాల్గొని ప్రసంగించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు.

తుంగభద్ర నదిలో మునిగి వ్యక్తి మృతి

సి.బెళగల్: మండల పరిధిలోని గుండ్రేవుల గ్రామం వద్దనున్న తుంగభద్ర నదిలో మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలు..మండల కేంద్రం సి.బెళగల్‌లోని ఎన్టీఆర్ కాలనీలో వడ్డె నీలప్ప (68) నివాసం ఉంటున్నాడు. అతను తెలంగాణ రాష్ట్రం పెద్ద దన్వాడ గ్రామంలో బంధువులు మారెమ్మకు చేస్తుండటంతో అక్కడికి వెళ్లాడు. పూజల అనంతరం పెద్ద దన్వాడ, గుండ్రేవులకు సరిహద్దు గ్రామం కావడంతో అక్కడ నుంచి తుంగభద్ర నది దారిలో వస్తూ గుండ్రేవుల వద్ద నీటిలో మునిగిపోయాడు. అక్కడ ఉన్నవారు గమనించి బయటకు తీసేలోపే మృతి చెందాడు. మృతుడి భార్య సుంకులమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ రామయ్య తెలిపారు.

కారు దగ్ధం

గడివేముల: మండల పరిధిలోని తిరుపాడు గ్రామం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన కారు, ఎక్సెల్ బైకు బుధవారం పూర్తిగా దగ్ధమయ్యాయి. చుట్టు ప్రక్కల జొన్న పంట పొలంలోని వ్యర్థాలను తగలబెట్టగా మంటలు వ్యాపించి వాహనాలకు అంటుకున్నాయి. గమనించిన వాహనదారులు నంద్యాల ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందిన ఫైర్ ఇంజన్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని ప్రమాదంపై ఆరాతీస్తున్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రంజాన్ మాసం సందర్భంగా నగరంలోని 48వ వార్డు రోజా పాత మసీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ పాల్గొన్నారు. బుధవారం రాత్రి మసీద్ పెద్దలతో కలసి దువా చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు సెక్రటరీ దాదా పీర్ సాహెబ్, కార్పొరేటర్ కృష్ణకాంత్ రెడ్డి, నాయకులు హకీమ్, రియాజ్ బాబా పాల్గొన్నారు.

నేటి నుంచి తీన్‌షబీ షబీనా

కర్నూలు(రాజ్‌విహార్): తీన్ షబీ షబీనా పేరుతో మూడు రోజుల తరావీ నమాజ్‌లో పూర్తి ఖురాన్ పఠించనున్నట్లు డాక్టర్ సయ్యద్ రిజ్వాన్ పాషా ఖాద్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పాతబస్తీలోని లవుబాలి దర్గా మసీదులో ఈ నెల 30, 31, ఏప్రిల్ 1వ తేదీల్లో కార్యక్రమం ఉంటుందని, రాత్రి ఇషా నమాజు 8:30 గంటలకు ప్రారంభమవుతుందని వెల్లడించారు. పవిత్ర రంజాన్ మాసం తరావీ నమాజులో ఖురాన్ పఠించేందుకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. సాధారణంగా ప్రతిరోజూ ఒక గంట పాటు ఒక భాగం చొప్పున 30 రోజుల్లో 30 భాగాలు పఠనం చేసి నమాజు చదివిస్తారు. అయితే తీన్ షబీ షబీనా పేరుతో రోజుకు 10 భాగాల చొప్పున పఠనం చేసి మూడు రోజుల్లో 30 భాగాల ఖురాన్‌ను పూర్తి చేయనున్నారు. చివరి రోజు శనివారం సహెరి ఏర్పాట్లు ఉంటుందని పేర్కొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్ : దసరా, భోలా, దాస్ కా ధమ్కీ, బలగం
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : దసరా, పరారీ, గీతసాక్షిగా, డంజియన్స్ అండ్ డ్రాగన్స్ : హానర్ అమాంగ్ థీవ్స్, దాస్ కా ధమ్కీ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : దసరా, సార్, వినరో భాగ్యము విష్ణు కథ
ఐనాక్స్ : భోలా, జాన్ విక్ చాప్టర్-4, డంజియన్స్ అండ్ డ్రాగన్స్ : హానర్ అమాంగ్ థీవ్స్, తూ జూతీ మై మక్కార్, గురుదేవ్ హొయ్‌సల
రాజ్ : దసరా,
శ్రీరామ : ఆరంజ్
విజయ : జాన్ విక్ చాప్టర్-4